సాక్షి
జగిత్యాల
సోమవారం : 22, మే 2023



నృసింహునికి మొక్కులు

ధర్మపురి: నిజామాబాద్ ఎమ్మెల్యే గణేశ్ గుప్తా దంపతులు ఆదివారం ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామిని దర్శించుకున్నారు.



విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు

ఇబ్రహీంపట్నం : వేములకుర్తిలో ఆదివారం పెద్దమ్మతల్లి విగ్రహ పునః ప్రతిష్ఠాపన ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు.

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం
42.0/28.0

వాతావరణం పొడిగా ఉంటుంది. గాలిలో తేమశాతం తగ్గుతుంది. రోజంతా ఎండగా ఉంటుంది.

న్యూస్‌రీల్

అంజన్న సన్నిధిలో ప్రముఖుల పూజలు



పూజలు చేస్తున్న సీపీ కుటుంబ సభ్యులు

మల్యాల(చొప్పదండి): కొండగట్టు శ్రీఆంజనేయస్వామిని ఆదివారం ప్రముఖులు దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. సిద్దిపేట పోలీస్ కమిషనర్ ఎ.శ్వేత కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డి స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు శేష వస్త్రాలతో వారిని సత్కరించి, తీర్థ,ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు రామకృష్ణ, రఘు, ఉప ప్రధాన అర్చకుడు చిరంజీవిస్వామి, స్థానాచార్యులు కపీందర్, డీఎస్పీ ప్రకాశ్, ఎస్సై చిరంజీవి పాల్గొన్నారు.

ఇథనాల్ పరిశ్రమ వ్యతిరేక జేఏసీ ఏర్పాటు



జేఏసీ నూతన కార్యవర్గం

వెల్గటూర్(ధర్మపురి): స్తంభంపల్లి శివారులో ఏర్పాటు చేయనున్న ఇథనాల్ పరిశ్రమకు వ్యతిరేకంగా ఆ గ్రామస్తులు ఆదివారం ఉమ్మడి కార్యాచరణ కమిటీ ఏర్పాటు చేశారు. అధ్యక్షుడిగా హరిప్రశాంత్, గౌరవ అధ్యక్షుడిగా సర్పంచ్, ఎంపీటీసీలు చల్లూరి రూపారాణి, పాడేటి సతీశ్, ఉపాధ్యక్షులుగా శేరి గణేశ్, యాగండ్ల గంగయ్య, ప్రధాన కార్యదర్శిగా భూపెల్లి ఆనంద్, సహాయ కార్యదర్శిగా జక్కుల మహేందర్, ప్రచార కార్యదర్శిగా నక్క రమేశ్, కోశాధికారిగా తొగిటి రమేశ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఇథనాల్ పరిశ్రమ నిర్మాణం రద్దుకు తీసుకోవాల్సిన నిర్ణయాలు, భవిష్యత్ కార్యాచరణ గురించి గ్రామస్తులతో చర్చించి ఉమ్మడి ప్రణాళికతో ముందుకు వెళ్తామన్నారు.

కొనుగోలు కేంద్రాల్లో సౌకర్యాలేవీ?



ధాన్యం పరిశీలిస్తున్న లక్ష్మణ్‌కుమార్

వెల్గటూర్(ధర్మపురి): ఎండపల్లి మండలం అంబారిపేట ధాన్యం కొనుగోలు కేంద్రంలో కనీస సౌకర్యాలు లేవని డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్ కుమార్ విమర్శించారు. ఆదివారం ఆయన కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. 45 రోజులు గడిచినా కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం నిల్వలు అలాగే ఉన్నాయన్నారు. నిర్వాహకుల నిర్లక్ష్యమే ఇందుకు కారణమని దుయ్యబట్టారు. అకాల వర్షాలతో ధాన్యం తడుస్తున్నా కనీసం టార్పాలిన్ కవర్లు కూడా ఇవ్వడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులు ఇబ్బందులు పడుతున్నా.. మంత్రి కొప్పుల ఈశ్వర్ బీఆర్ఎస్ పార్టీలో చేరేవారికి కండువాలు కప్పే కార్యక్రమాల్లో బిజీగా ఉన్నారని ఎద్దేవా చేశారు. సోమవారం ఉదయం 9 గంటల్లోగా కొనుగోలు కేంద్రాలకు లారీలు రాకపోతే.. ఉదయం 10 గంటలకు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తామని ఆయన హెచ్చరించారు. నాయకులు శైలేందర్ రెడ్డి, రమేశ్, రాజయ్య, గెల్లు శ్రీనివాస్, రమేశ్, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణ లక్ష్యం



అనుమానితులను ప్రశ్నిస్తున్న పోలీసులు

జగిత్యాలక్రైం: శాంతిభద్రతల పరిరక్షణ కోసం ఎస్పీ భాస్కర్ ఆదేశాల మేరకు కార్డెన్ సెర్చ్ నిర్వహించామని డీఎస్పీ ప్రకాశ్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని హనుమాన్‌వాడలో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. డీఎస్పీ మాట్లాడుతూ ప్రజలు అనుమానితులకు ఇళ్లు అద్దెకు ఇవ్వొద్దన్నారు. అనుమానితులు కనిపిస్తే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. ధ్రువీకరణ పత్రాలు లేని ఒక ట్రాక్టర్, ఒక ఆటో, 103 ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. కార్యక్రమంలో సీఐలు రాంచందర్‌రావు, అరిఫ్ అలీఖాన్, ఎస్సైలు సంజీవ్, సందీప్ పాల్గొన్నారు.

భరోసా లేని బతుకులు!



మామిడికాయల వ్యాన్‌పై వలస కూలీల తరలింపు

- జిల్లాలోని కొడిమ్యాల మండలం పూడూరు శివారు దొంగలమర్రి వద్ద శనివారం రాత్రి టైర్ పేలి మామిడికాయల లోడ్ వ్యాన్ అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన వలస కూలీలు సునీత(35), మమత(35) దుర్మరణం చెందారు. మరికొందరు కూలీలు తీవ్రంగా గాయపడ్డారు. గాయపడ్డ వారిలో ఇద్దరు చిన్నారులూ ఉన్నారు.

- మల్లాపూర్ మండలం గుండంపల్లి గ్రామ సమీపంలో వారం క్రితం గూడ్స్ ఆటో అదుపుతప్పి పక్కనే ఉన్న గోతిలోకి దూసుకెళ్లింది. ఆటోలో మామిడి కాయ తెంపేందుకు వెళ్లిన వలస కూలీలకు త్రుటిలో ప్రాణాపాయం తప్పింది.



మామిడి మార్కెట్ సమీపంలో వంటలు తయారు చేసుకుంటున్న వలస కూలీలు

- భద్రత లేని ప్రయాణాలు
- పొట్టచేత పట్టుకుని.. స్వరాష్ట్రం దాటి..
- జిల్లాకు వస్తున్న వలస కూలీలు
- మామిడి మార్కెట్‌లో పనులు
- కనీస భద్రతా చర్యలు చేపట్టని మామిడి వ్యాపారులు
- ఉంటే రేకుల షెడ్లు.. లేదంటే చెట్లే నివాసాలు
- మహారాష్ట్ర, ఒడిశా, మధ్యప్రదేశ్ శ్రమజీవుల తిప్పలు

కోరుట్ల: పొట్టకూటి కోసం ఇతర రాష్ట్రాల నుంచి వలస వస్తున్న కూలీల భద్రతపై నిర్లక్ష్యమే కాదు.. వసతుల కల్పనపైనా పట్టింపు కరువైంది. ఒడిశా, మధ్యప్రదేశ్, మహారాష్ట్రకు చెందిన వేలాది మంది వలస కూలీలు ఏటా మామిడి సీజన్‌లో జగిత్యాల జిల్లాకు ఉపాధి కోసం తరలివస్తున్నారు. మామిడిని మార్కెట్ చేయడం, లాభాలు పొందడంపైనే దృష్టి సారిస్తున్న వ్యాపారులు.. మండుటెండల్లో పొద్దంతా శ్రమిస్తున్న వలస కూలీలకు భద్రత, వసతులు కల్పించడంపై శ్రద్ధ చూపడం లేదు. కార్మిక శాఖ అధికారులు కూడా వారి స్థితిగతులపై దృష్టి సారించకపోవడం విస్మయం కలిగిస్తోంది.

జిల్లాకు ఏటా రెండు వేల మంది రాక..

- జిల్లాలోని జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి మామిడి మార్కెట్లలో ఉపాధి కోసం మధ్యప్రదేశ్, బీహార్, ఒడిశా రాష్ట్రాల నుంచి వలస కూలీలు ఏటా పెద్దఎత్తున తరలివస్తారు.
- ప్యాకింగ్, లోడింగ్ పనులు చేసేవారికి రోజూ రూ.600, మామిడికాయలు తెంపేవారికి రూ.500- రూ.700 వరకు వ్యాపారులు కూలి చెల్లిస్తున్నారు.
- సీజన్ ముగిసే వరకూ మార్కెట్ల సమీపంలోనే కూలీలు తాత్కాలిక నివాసాలు, రేకుల షెడ్లు ఏర్పాటు చేసుకుని వసతి పొందుతున్నారు.
- జిల్లాలో సుమారు 17వేల హెక్టార్లలో మామిడి తోటలు విస్తరించి ఉన్నాయి.
- కాయలు తెంపి ఢిల్లీ, గుజరాత్ మార్కెట్లకు తరలించడానికి పెద్దఎత్తున కూలీలు అవసరం.
- స్థానికంగా కూలీలు కొరత ఉండడం, కూలి రెట్ల డిమాండ్ అధికం కావడంతో వ్యాపారులు వలస కూలీలతో పనులు చేయించడానికి మొగ్గుచూపుతున్నారు.



చెట్ల కింద వలస కూలీల తిప్పలు

మండుటెండలు.. రేకుల షెడ్లు..

- సుమారు రెండు నెలల పాటు స్థానికంగా ఉండే వలస కూలీలు.. రేకుల షెడ్లు, ఆరుబయట టెంట్లు వేసుకుంటున్నారు.
- మరికొందరు చెట్ల నీడను నివాసాలుగా మార్చుకుంటున్నారు.
- ఉదయం, సాయంత్రం వేళ షెడ్లకు సమీపంలో ఆరుబయట వంటలు తయారు చేసుకోవడం, రాత్రి ఉక్కపోతలోనే నిద్రించడం, నీళ్లు, కరెంటు సౌకర్యాలు లేకున్నా.. మహిళా కూలీలు టెంట్లు కట్టుకుని స్నానాలు చేయడం ఇబ్బందికరంగా మారుతోంది.
- ఇలాంటి వలస కూలీలకు వసతుల కల్పనపై కార్మిక శాఖ అధికారులు కనీసం దృష్టి సారించకపోవడం శోచనీయం.

అడ్డగోలుగా లోడింగ్..

ఏటా సుమారు 45 రోజుల పాటు మామిడి మార్కెట్ కొనసాగుతుంది. తక్కువ సమయంలో వేల ఎకరాల్లోని తోటల్లో కాయలు తెంపడం, ప్యాక్ చేయడం వంటి పనులు ఉండటంతో వలస కూలీల అవసరం అధికంగా ఉంటోంది. రోజూ మార్కెట్ల నుంచి సుమారు 20 కి.మీ. నుంచి 45 కి.మీ. దూరంలోని మారుమూల ప్రాంతాల్లో ఉన్న మామిడి తోటలకు కూలీలను తరలించి కాయలు తెంపుతున్నారు. ఈ తరలింపు సమయంలో వ్యాన్లు, ఆటోలు, లారీలు వినియోగిస్తున్నారు. ఉదయం తోటలకు వెళ్లే సమయంలో ఖాళీగా ఉన్న వాహనాల్లో పరిమితికి మించి కూలీలను ఎక్కిస్తున్నారు. కాయలు తెంపడం పూర్తయ్యాక అవే వాహనాల్లో కాయలు లోడ్ చేసి వాటిపై కూలీలను కూర్చోబెట్టుకుని మార్కెట్‌కు తీసుకొస్తున్నారు. పరిమితి అధికం కావడంతో వాహనాలు కుదుపులకు గురై అదుపు తప్పుతున్నాయి. దీనికితోడు కాయలు తోటల నుంచి మార్కెట్‌కు తరలించడానికి వాహనాలు అధికంగా అవసరం ఉండటంతో ఫిట్‌నెస్ ఉన్నా, లేకున్నా పట్టించుకోకుండా వినియోగిస్తున్నారు. ఫలితంగా తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి.

గిట్టుబాటవుతుందని వస్తున్నం



మా ఏరియాలో వేసవిలో పనులు దొరకవు. ఇబ్బందిగా ఉంటుంది. అందుకే రెండు నెలలు ఇక్కడి మామిడి మార్కెట్‌లో పనిచేస్తే కూలి గిట్టుబాటు అవుతుంది. లోడింగ్ వ్యాన్లలో వెళ్లేటప్పుడు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుంటం. రేకుల షెడ్లలో పిల్లాపాపలతో ఉంటున్నం. వసతులు ఉన్నా, లేకున్నా పొట్టతిప్పల కోసం రాక తప్పడంలేదు.

– సునీల్, వలస కూలీ, మహారాష్ట్ర

మా పరిధిలో లేదు

వలస కూలీల వసతులు, సౌకర్యాల కల్పన కోసం ఆయా ప్రాంతాల్లోని మార్కెట్ యార్డుల నుంచి కొంత సొమ్ము వెచ్చించాల్సి ఉంటుంది. ఈ విషయంలో మేం ఎలాంటి చర్యలు తీసుకోలేం. స్థానికంగా ఉన్న మార్కెట్ యార్డుల అధికారులు పూర్తిబాధ్యత తీసుకోవాలి.

– అనిల్, కార్మిక శాఖ అధికారి, మెట్‌పల్లి



మార్కెట్‌లో మామిడికాయలు ప్యాకింగ్, లోడింగ్ చేస్తున్న వలస కూలీలు

అభివృద్ధిని చూసి పార్టీలో చేరుతున్నారు..



కండువా కప్పి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న మంత్రి కొప్పుల ఈశ్వర్

- మంత్రి కొప్పుల ఈశ్వర్

వెల్గటూర్(ధర్మపురి): రాష్ట్రప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి ప్రజలు బీఆర్ఎస్ వైపు ఆకర్షితులవుతున్నారని మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. ఎండపల్లి మండలం రాజారాంపల్లిలో ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వివిధ పార్టీలకు చెందిన సుమారు 200 మంది బీఆర్ఎస్ పార్టీలో చేరారు. యాదవ హక్కుల కమిటీ జిల్లా కార్యదర్శి, కాంగ్రెస్ పార్టీ రాజారాంపల్లి గ్రామశాఖ అధ్యక్షుడు మ్యాకల సంతోష్‌తోపాటు కాంగ్రెస్ పార్టీ నుంచి సుమారు 170 మంది, బీజేపీ నుంచి దాదాపు 30 మంది వరకు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వారికి మంత్రి కొప్పుల ఈశ్వర్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మంత్రి మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలు దేశానికే దిక్సూచిగా ఉన్నాయన్నారు. ఇతర రాష్ట్రాలు మన పథకాలను ఆదర్శంగా తీసుకుని అమలు చేస్తున్నాయని తెలిపారు. ఇవి ముఖ్యమంత్రి కేసీఆర్ ముందుచూపుతో తీసుకున్న గొప్ప నిర్ణయాలని కొనియాడారు. రైతుబంధు, రైతుబీమా, ఆసరా పింఛన్లు, కల్యాణలక్ష్మీ, దళితబంధు, కాళేశ్వరం ప్రాజెక్టు లాంటి పథకాలు దేశానికే ఆదర్శమన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వం ద్వారా లబ్ధి పొందని ఇల్లు లేదంటే అతిశయోక్తికాదని అన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న మంత్రి

ధర్మపురి(బుగ్గారం): బుగ్గారం మండలం గంగాపూర్ గ్రామానికి చెందిన వృద్ధుడు రెంటం రాజమల్లు వెల్గొండలోని తన కొడుకు వద్దకు ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా.. ధర్మపురి నుంచి జగిత్యాల వైపుకు వెళ్తున్న ఓ కారు వెల్గొండ ఎక్స్‌రోడ్డు వద్ద ఢీకొట్టింది. రాజమల్లుకు తీవ్ర గాయాలు కాగా.. అదే సమయంలో వెల్గొండకు వెళ్తున్న మంత్రి కొప్పుల ఈశ్వర్ తన కాన్వాయి ఆపారు. గాయపడ్డ వృద్ధుడిని తన కాన్వాయిలో ఆస్పత్రికి తీసుకెళ్లారు. వైద్యఖర్చుల కోసం రూ.రెండు వేలు అందజేశారు. వెల్గొండకు చెందిన పెసరి అశోక్, పాండు ఇటీవల కాలిపోవడంతో మంత్రి వారిని పరామర్శించారు.

మంత్రికి పుష్పగుచ్ఛం అందజేత

పెగడపల్లి(ధర్మపురి): తమ ఉద్యోగాలను క్రమబద్ధీకరించినందుకు కృతజ్ఞతగా పలువురు వీఆర్ఏలు మంత్రి ఈశ్వర్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు వీఆర్ఏలు పాల్గొన్నారు.

నేటి బంద్‌కు బీజేపీ మద్దతు

జగిత్యాల: రైతు సంఘాలు సోమవారం ఇచ్చిన జిల్లా బంద్‌కు తమ మద్దతు ఉంటుందని బీజేపీ నాయకులు ప్రకటించారు. ఆదివారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నాయకులు పన్నాల తిరుపతిరెడ్డి, అనుమల్ల కృష్ణహరి, జగదీశ్, మెరుగు ఉమేశ్ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

సారంగాపూర్(జగిత్యాల): ఆయిల్‌పామ్ సాగుపై ఆసక్తిఉన్న రైతులు దరఖాస్తు చేసుకోవాలని వ్యవసాయాధికారి తిరుపతినాయక్ సూచించారు. పట్టాదారు పాసుపుస్తకం, లేదా 1బి, ఆధార్, బ్యాంకు పాసుపుస్తకం ప్రతులు, రెండు పాసుపోర్టు సైజ్‌ఫొటోలు జతచేయాలన్నారు. ఎకరాకు 57 మొక్కలు నాటాలని ఆయన కోరారు. ఒక్కోమొక్క ధర రూ.193వరకు ఉంటుందని, రైతు రూ.20 చెల్లిస్తే సరిపోతుందని పేర్కొన్నారు. ఈనెల 31లోగా దరఖాస్తులు సమర్పించాలని సూచించారు.

ఖిలాను అభివృద్ధి చేస్తాం



పిచ్చిమొక్కలు తొలగిస్తున్న అదనపు కలెక్టర్

జగిత్యాల: పట్టణాన్ని అభివృద్ధి చేసేలా చర్యలు తీసుకుంటామని అదనపు కలెక్టర్ మకరంద్ అన్నారు. ఆదివారం ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమం సందర్భంగా ఖిలాలో చెత్తాచెదారం తొలగించారు. అధికారులు, మహిళలు, ప్రజలు పెద్దఎత్తున పాల్గొన్నారు. ప్రతిఒక్కరూ పచ్చదనం, పరిశుభ్రత పాటించాలన్నారు. ప్లాస్టిక్ నిర్మూలనకు కృషి చేయాలని కోరారు. అనంతరం ప్లాస్టిక్ వ్యర్థాల నిర్మూలనపై సంతకాల సేకరణ చేసి, ప్రతిజ్ఞ చేపట్టారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ గోలి శ్రీనివాస్, డీఈ రాజేశ్వర్, సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

నవభారత నిర్మాణానికి ఆద్యుడు రాజీవ్



రాజీవ్‌గాంధీ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

జగిత్యాలరూరల్: నవ భారత నిర్మాణానికి సాంకేతిక విజ్ఞానం అందించిన నేత రాజీవ్‌గాంధీ అని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ వర్ధంతిని స్థానిక ఇందిరాభవన్‌లో ఆదివారం నిర్వహించారు. రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పెరుకపల్లిలోని రాజీవ్‌గాంధీ విగ్రహానికి పూలమాలలు వేశారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ దేశ సమగ్రతను కాపాడేందుకు పాదయాత్ర చేశారని, ప్రపంచశాంతి కోసం కృషి చేశారని, ఆయన సేవలు చిరస్మరణీయమన్నారు. ప్రజాస్వామ్యాన్ని మరింత పటిష్టం చేసేందుకు యువతకు ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, నాయకులు గిరి నాగభూషణం, బండ శంకర్, విజయలక్ష్మి, నందయ్య, దుర్గయ్య, రాజిరెడ్డి, జీవన్, గుండా మధు, రమేశ్‌రావు పాల్గొన్నారు.

బంగారు ఆభరణాలు చోరీ

రాయికల్: మండలంలోని కొమురవెల్లి వేణుగోపాల్ అనే స్వర్ణకారుడి దుకాణంలో చోరీకి పాల్పడినట్లు ఎస్సై కిరణ్‌కుమార్ తెలిపారు. వేణుగోపాల్ కులవృత్తి చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. శనివారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు తనషాపు తాళాలు పగులగొట్టి 8 గ్రాముల బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లినట్లు వేణుగోపాల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న ఎస్సై తెలిపారు.

పెద్దచెరువులో చేపలు మృతి

మెట్‌పల్లి(కోరుట్ల): ఆత్మకూర్ పెద్దచెరువులో ఆదివారం చేపలు మృత్యువాతపడ్డాయి. మత్స్య పారిశ్రామిక సహకారం సంఘం ఆధ్వర్యంలో 40వేలు, ప్రభుత్వం తరఫున మరో 50వేల చేపపిల్లలను పెద్దచెరువులో పెంచుతున్నారు. ఆదివారం సంఘ సభ్యులు చెరువు వద్దకు వచ్చి చూసేసరికి పెద్దసంఖ్యలో చేపలు చనిపోయి కనిపించాయి. వీటి మృతిపై అనుమానాలు ఉండడంతో విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పిచ్చికుక్క దాడిలో ముగ్గురికి గాయాలు

బోయినపల్లి (చొప్పదండి) : పిచ్చికుక్క దాడిలో ముగ్గురు గాయపడ్డారు. మండలంలోని తడగొండ గ్రామానికి చెందిన కట్ట గంగమ్మ, జాగిరు రాజమ్మ, షాదుల్ల పిచ్చికుక్క దాడిలో గాయపడ్డారు. చికిత్స నిమిత్తం వారిని ఆస్పత్రికి తరలించారు. కొన్ని రోజులుగా గ్రామంలో పిచ్చికుక్కల బెడద ఉందని, దీంతో భయాందోళన చెందుతున్నట్లు గ్రామస్తులు తెలిపారు.

శ్రీవారి ఆలయ నిర్మాణానికి శ్రీకారం

- 31న ఉదయం 7:26 గంటలకు భూమిపూజ.. శ్రీవేంకటేశ్వరస్వామివారి కల్యాణం
- ఏపీ సీఎం జగన్మోహన్ రెడ్డికి సీఎం కేసీఆర్ విజ్ఞప్తి
- సమ్మతించిన టీటీడీ బోర్డు
- కరీంనగర్‌లోని పద్మనగర్‌లో పదెకరాలు కేటాయించిన రాష్ట్ర ప్రభుత్వం
- రూ.20 కోట్లతో ఆలయ నిర్మాణం చేపట్టనున్న టీటీడీ



ఇటీవల పద్మనగర్‌లో స్థలాన్ని పరిశీలిస్తున్న మంత్రి కమలాకర్

విద్యానగర్(కరీంనగర్): అఖిలాండ కోటి బ్రహ్మాండ నాయకుడైన శ్రీవేంకటేశ్వరస్వామి నిత్య పూజా ప్రియుడు. తిరుమల తిరుపతి దేవస్థానంలో వేద మంత్రోచ్ఛరణల మధ్య దేవదేవునికి నిర్వహించే అనిర్వచనీయమైన నిత్య కైంకర్య వైభోగాన్ని కరీంనగర్‌లో జిల్లావాసులతోపాటు ఉత్తర తెలంగాణ భక్తులు త్వరలోనే ప్రత్యక్షంగా వీక్షించనున్నారు.

2018 నుంచి కరీంనగర్‌లో బ్రహ్మోత్సవాలు..
కరీంనగర్‌లోని మార్కెట్ రోడ్‌లో గల శ్రీవేంకటేశ్వరాలయానికి 150 సంవత్సరాల చరిత్ర ఉంది. ఈ ఆలయంలో శ్రీవారి బ్రహ్మోత్సవాలకు రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌరసరఫరాల శాఖల మంత్రి గంగుల కమలాకర్ 2018లో శ్రీకారం చుట్టారు. ఈ ఏడాది జనవరి 27 నుంచి ఫిబ్రవరి 2 వరకు ఆరుసార్లు ఉత్సవాలు నిర్వహించారు.

శ్రీవారి ఆలయ నిర్మాణానికి టీటీడీ సమ్మతి..
కరీంనగర్‌లో శ్రీవారి ఆలయ నిర్మాణ విషయమై మంత్రి కమలాకర్ రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్‌తో కలిసి సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన ఆయన ఏపీ సీఎం వైఎస్.జగన్మోహన్ రెడ్డితో మాట్లాడారు. కరీంనగర్‌లో తిరుమలేశుని ఆలయం నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. దీనికి ఆయన సానుకూలంగా స్పందించి, టీటీడీ బోర్డుకు ఆదేశాలిచ్చారు. ఫలితంగా టీటీడీ బోర్డు కరీంనగర్‌లో ఆలయ నిర్మాణానికి సమ్మతించింది.

పశుసంవర్ధక శాఖ స్థలం కేటాయింపు
వెంకన్న ఆలయ నిర్మాణానికి మార్చి 15, 2022న కరీంనగర్‌లోని పద్మనగర్‌లో గల పశుసంవర్ధక శాఖకు సంబంధించిన పదెకరాల స్థలాన్ని రాష్ట్ర ప్రభుత్వం కేటాయించింది. సంబంధిత పత్రాలను సీఎం కేసీఆర్ అసెంబ్లీలోని ఆయన చాంబర్‌లో మంత్రి గంగుల కమలాకర్, టీటీడీ హైదరాబాద్ లోకల్ అడ్వైజరీ కమిటీ చైర్మన్ జీవీ భాస్కర్‌రావులకు అందజేశారు. వీరు మార్చి 30న కలెక్టర్ కర్ణన్, మేయర్ సునీల్‌రావు, స్థపతి రవికాంత్‌లతో కలిసి, ఆ స్థలాన్ని పరిశీలించారు. ల్యాండ్ సర్వే సహాయ సంచాలకుడు అశోక్, సర్వేయర్లు కొలతలు తీశారు.

వెంకటాచల ఆలయ సందర్శన
అమరావతిలో నిర్మాణంలో ఉన్న వెంకటాచల టీటీడీ ఆలయాన్ని మే 28, 2022న మంత్రి కమలాకర్ తన బృందంతో కలిసి సందర్శించారు. అక్కడ జరుగుతున్న పనులను పరిశీలించారు. మరుసటి రోజు టీటీడీ ప్రధాన స్థపతి మునిస్వామిరెడ్డి, సహాయ స్థపతి కృష్ణారావు, యాదాద్రికి పని చేసిన ఆనంద్‌సాయి, రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్‌లతో కలిసి కరీంనగర్‌లో కేటాయించిన స్థలాన్ని పరిశీలించారు.

అనుమతి పత్రాలిచ్చిన టీటీడీ చైర్మన్
ఈ నెల 15న టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి కరీంనగర్‌లో ఆలయ నిర్మాణ అనుమతి పత్రాలను మంత్రికి హైదరాబాద్‌లో అందజేశారు. రూ.20 కోట్లతో ఆలయ నిర్మాణం చేపట్టనున్నారు. ఈ నెల 31న ఉదయం 7:26 గంటలకు వేదమంత్రోచ్ఛరణల మధ్య భూమిపూజ, అదేరోజు సాయంత్రం శ్రీవారి కల్యాణం నిర్వహించనున్నారు.

ఆగమశాస్త్రం ప్రకారం నిర్మిస్తాం



త్వరలో తిరుమల వెళ్తాం. వేంకటేశ్వర స్వామి అంతరాలయం, గోపురాలు, బాహ్యాలయ నిర్మాణాల నమూనాలతోపాటు మూల విరాట్టు, పోటు, ప్రసాద వితరణ కేంద్రాలను పరిశీలిస్తాం. ఆగమశాస్త్రం ప్రకారం కరీంనగర్‌లో శ్రీవారి ఆలయం నిర్మించి, రాష్ట్ర ప్రజలకు ఆ దేవదేవుని దర్శన భాగ్యం కల్పిస్తాం. – గంగుల కమలాకర్, రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌరసరఫరాల శాఖల మంత్రి

దగ్గరలో స్వామివారి దర్శనం



దూరభారంతోపాటు ఆర్థికంగా ఇబ్బంది పడుతూ తిరుమల వెళ్లలేని వారికి దగ్గరలో వేంకటేశ్వర స్వామివారి దర్శన అవకాశం లభించనుంది. కరీంనగర్‌లో ఆలయ నిర్మాణం వల్ల వృద్ధులు, దివ్యాంగులకు ప్రయాణ బాధలు తప్పుతాయి. వారికి స్వామివారి దర్శన భాగ్యం కలుగుతుంది.
– గోగుల ప్రసాద్, కరీంనగర్‌లో శ్రీవారి బ్రహ్మోత్సవాల నిర్వహణ కమిటీ బాధ్యుడు

కూలీ పనులకెళ్తే ప్రాణాలు పోయాయి



ఆస్పత్రి వద్ద విషాదంలో ఉన్న బంధువులు

జగిత్యాలక్రైం: స్వరాష్ట్రంలో ఉపాధిలేక కూలీ పనుల కోసం వచ్చి మృత్యువాతపడ్డ వలసజీవుల వ్యథ ఇది.. మధ్యప్రదేశ్‌కు చెందిన కొందరు కూలీలు పొట్టకూటి కోసం జగిత్యాల రూరల్ మండలం చల్‌గల్ గ్రామానికి చేరుకున్నారు. హస్నాబాద్‌లో నివాసం ఉంటున్నారు. నిజామాబాద్‌కు చెందిన మామిడి వ్యాపారి అసద్ వద్ద పనికి కుదిరి.. జగిత్యాల మామిడి మార్కెట్‌లో పనిచేస్తున్నారు. శనివారం ఉదయం రెండు వాహనాల్లో 21మంది కూలీలు కరీంనగర్ సమీపంలోని తోటలో మామిడి కాయలు కోసేందుకు వెళ్లారు. రాత్రి జగిత్యాలకు వస్తుండగా పూడూరు శివారు దొంగలమర్రి వద్ద వారు ప్రయాణిస్తున్న వాహనం టైరు పేలి, అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో సునీత(35) అక్కడికక్కడే మృతిచెందింది. మమత(35) జగిత్యాల ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందింది. మరొకరు దుర్గేశ్ తీవ్రంగా గాయపడి పరిస్థితి విషమంగా ఉంది. దేవీలాల్ సింగ్, ప్రిల్‌భాయ్, దీపక్, వినోద్, నగేశ్, దానిమకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు వారిని జగిత్యాల ఆస్పత్రికి తరలించారు. ఉపాధి కోసం వచ్చిన ఇద్దరు మహిళలు మృతిచెందడంతో కూలీల రోదలను మిన్నంటాయి. మృతురాలు సునీత మధ్యప్రదేశ్‌లోని బేతుల్ జిల్లా చిచ్చొరికు చెందిన వ్యక్తి. ఆమె కూతురు దానిమ(4)కు కూడా తీవ్ర గాయాలయ్యాయి. మమత కూతురు మునవాడి గాయాలపాలైంది. ఆదివారం ఉదయం మృతదేహాలకు పోస్టుమార్టం చేయించిన మల్యాల ఎస్సై చిరంజీవి.. మామిడికాయల వ్యాపారులు సమకూర్చిన అంబులెన్స్‌లో మృతదేహాలను మధ్యప్రదేశ్ తరలించారు.



తల్లి మృతితో రోదిస్తున్న మునాసో



తల్లి మృతితో అనాథగా మారిన దావ్య

చిన్నారిని చూసి..
మృతురాలు సునీతకు కూతురు దావ్య(4) ఉంది. భర్త మూడేళ్ల క్రితమే మృతిచెందాడు. దావ్యను తీసుకుని ఉపాధి వెతుక్కుంటూ జగిత్యాల మామిడి మార్కెట్‌కు వచ్చింది. తల్లి రోడ్డు ప్రమాదంలో మృతిచెందడంతో దావ్యను చూసిన స్థానికులు కన్నీరుమున్నీరయ్యారు.

‘హరిత’ సన్నద్ధం

- తొమ్మిదో విడత హరితహారానికి మొక్కల పెంపకం
- జూన్ నుంచి మొక్కలు నాటేలా ప్రణాళిక
- వేసవి నేపథ్యంలో సంరక్షణ చర్యలు

గొల్లపల్లి : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన హరితాహారం కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అధికారులు అన్ని చర్యలు చేపట్టారు. తొమ్మిదో విడతలో జిల్లావ్యాప్తంగా 24.7 లక్షల మొక్కలు నాటేందుకు అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. పచ్చదనం పెంపొందించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం హరితహారం కార్యక్రమాన్ని చేపట్టింది. జిల్లావ్యాప్తంగా ఫారెస్ట్ శాఖ ఆధ్వర్యంలో 2.50 లక్షలు, ఉపాధిహామీ పథకం కింద నర్సరీల్లో 21.57 లక్షల మొక్కలను సిద్ధం చేస్తున్నారు. ఇందులో పండ్లు, పూలచెట్లతో పాటు నీడనిచ్చే మొక్కలు నాటేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నారు.

అటవీ శాఖ ఆధ్వర్యంలో 2.50 లక్షలు..
జిల్లాలోని ధర్మపురి, రాయికల్, మెట్‌పల్లి, కొడిమ్యాల, జగిత్యాల రేంజ్ పరిధుల్లో ఒక్కోరేంజ్‌లో 50 వేల చొప్పున నాటేందుకు మొక్కలు పెంచుతున్నారు. అల్లనేరెడు, గుల్‌మొహర్, ఫెల్టోఫామ్, సిందంగి, నారేప, పొరటవేప, జిట్రేగి ఏరుమద్ది, బాహునియా, మారేడు వంటి నీడనిచ్చే మొక్కలు ఉన్నాయి. ప్రస్తుతం పెంచుతున్న మొక్కలు కేవలం ఫారెస్ట్ ప్రాంతాల్లోనే పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నారు.



నర్సరీలో పెరుగుతున్న మొక్కలు

మొక్కల సంరక్షణకు చర్యలు..
రోజురోజుకూ ఎండలు మండుతున్నాయి. హరితహారం కార్యక్రమంలో భాగంగా సంబంధిత శాఖ అధికారులు మొక్కల సంరక్షణకు చర్యలు చేపట్టారు. సారవంతమైన మట్టిని పాలిథిన్ కవర్లలో నింపి మొక్కలు పెంచుతున్నారు. ఎండ తీవ్రతను తట్టుకునేందుకు నర్సరీపై గ్రీన్‌షెడ్ నెట్లు ఏర్పాటు చేస్తున్నారు.

పూలు, పండ్ల మొక్కలు..
జిల్లాలోని ప్రతి గ్రామంలో 5వేల నుంచి 7వేల మొక్కల చొప్పున జిల్లావ్యాప్తంగా 21.50 లక్షల మొక్కలు పెంచుతున్నట్లు డీఆర్డీఏ పీడీ కుందారపు లక్ష్మీ నారాయణ తెలిపారు. ఒక్కోనర్సరీకి రూ.40 వేల నుంచి రూ.60 వేలదాక వెచ్చిస్తున్నారు. దానిమ్మ, జామ, సీతాఫలం వంటి పండ్ల మొక్కలు, గులాబీ, మల్లెమందారం, నందివర్ధనం, గన్నేరు లాంటి పూలచెట్లు, పచ్చ తురురాయి, ఎర్ర తురాయి, కానుగ, వేప, సుబాబుల్, పకోడియా, జికరండా, మల్లే చామంతి, గన్నేరు వంటి పూల మొక్కలు పెంచుతున్నారు.

జూన్‌లో నాటేందుకు సిద్ధం చేస్తున్నాం..



హరితహారం కార్యక్రమంలో మొక్కలు నాటేందుకు అన్నిచర్యలు చేపట్టాం. వేసవిలో ఎండలకు నర్సరీలపై షెడ్‌నెట్‌లను ఏర్పాటు చేస్తున్నాం. మొక్కల సంరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. ఎనిమిదో విడత హరితహారానికి 18.50 లక్షల వరకు మొక్కలు సిద్ధం చేస్తున్నాం.
– లక్ష్మీనారాయణ, డీఆర్డీఏ పీడీ

మొక్కలను సంరక్షించాలి



పర్యావరణాన్ని కాపాడేందుకు ప్రతిఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించుకోవాల్సిన అవసరం ఉంది. జూన్, జూలై నెలల్లో ఎంపిక చేసిన ప్రాంతాల్లో మొక్కలు నాటేందుకు ప్రణాళికలు రూపొందించాం
– వెంకటేశ్వర్ రావు, జిల్లా ఫారెస్ట్ అధికారి

విద్యుత్ షాక్‌తో గేదెలు మృత్యువాత

ధర్మపురి (బుగ్గారం) విద్యుదాఘాతంతో ఐదు గేదెలు మృత్యువాతపడ్డాయి. వివరాల్లోకి వెళ్తే.. బుగ్గారం మండలంలోని సిరికొండలో శనివారం ఈదురు గాలులతో కూడిన వర్షానికి పంటపొల్లాల్లో విద్యుత్ స్తంభాల వైర్లు తెగిపడ్డాయి. ఆదివారం మేతకోసం గేదెలను తీసుకెళ్లగా విద్యుత్ వైర్లు తగిలి గ్రామానికి చెందిన అల్లె కొమురయ్య, అల్లె గట్టయ్య, కసాడి రాయలింగు, బంద్ర మల్లయ్య, ఏనుగు రత్నాకర్ రెడ్డి కేతిరెడ్డి రాజరెడ్డి అనే రైతులకు చెందిన ఐదు గేదెలు, రెండు కుక్కలు మృతిచెందాయి. సుమారు రూ.2 లక్షల వరకు నష్టం వాటిలినట్లు బాధిత రైతులు తెలిపారు. నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని పలువురు కోరుతున్నారు.

రైతుపై దాడి

మల్లాపూర్ (కోరుట్ల): కొనుగోలు కేంద్రంలో అదనపు కటింగ్‌పై నిర్వాహకుడిని నిలదీసినందుకు రైతుపై దాడికి దిగాడు. బాధిత రైతు తెలిపిన వివరాల ప్రకారం.. సిరిపూర్ సహకార సంఘం ఆధ్వర్యంలో నడికుడలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రానికి అదే గ్రామానికి చెందిన అప్పం చిన్నారెడ్డి అనే రైతు పది రోజుల క్రితం ధాన్యం తీసుకువచ్చాడు. కేంద్రం నిర్వాహకుడు ముద్దం రాజశేఖర్ రెడ్డిని ధాన్యం ఎక్కువ తూకం వేస్తున్నారంటూ నిలదీశాడు. దీంతో రాజశేఖర్ రెడ్డి దుర్భషలాడుతూ చిన్నారెడ్డిపై దాడిచేశాడు. దీంతో తనకు గాయాలుకావడంతో పాటు బెదిరింపులకు గురిచేశాడని, ముద్దం రాజశేఖర్‌పై చర్యలు తీసుకోవాలని ఎస్సై నవీన్ కుమార్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిపాడు.

స్వగ్రామానికి వలసజీవి మృతదేహం

రాయికల్: మండలంలోని ధర్మాజీపేట గ్రామానికి చెందిన అంగోతు లక్ష్మణ్ (45) నెలరోజుల క్రితం సౌదీలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. ఆదివారం స్వగ్రామానికి మృతదేహాన్ని తీసుకురాగా కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. మృతుడికి భార్య, కూతురు, కుమారుడు ఉన్నారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని తండావాసులు కోరుతున్నారు.

ఎల్లమ్మ సిద్ధోగ వేడుకలకు ఆహ్వానం

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట మండలం కోరుట్లపేటలో నిర్వహించే ఎల్లమ్మ సిద్ధోగ వేడుకలకు హాజరు కావాలని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్యను ఆహ్వానించారు. కుటుంబ సమేతంగా హాజరుకావాలని కోరుట్లపేట గౌడ కులస్తులు ఆహ్వానించారు.



గడతో తోట ఆగయ్య


చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

రాయికల్: మండలంలోని అల్లీపూర్ గ్రామానికి చెందిన దోసారపు శ్రీనివాస్ (41) చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందినట్లు ఎస్సై కిరణ్ తెలిపారు. శ్రీనివాస్ గౌడ్ ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్నాడు. ఈనెల 19న ఆత్మహత్యా యత్నానికి యత్నించగా చికిత్స నిమిత్తం స్థానికులు జగిత్యాల ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి భార్య నిర్మల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

జగిత్యాలక్రైం: జగిత్యాల రూరల్ మండలం కల్లెడ గ్రామానికి చెందిన మూల భూమయ్య ఆదివారం సాయంత్రం కారు ఢీకొనగా తీవ్ర గాయాలపాలయ్యాడు. భూమయ్య సాయంత్రం సైకిల్‌పై తాటిచెట్లు ఎక్కేందుకు వెళ్తుండగా ఎదురుగా వస్తున్న కారు ఢీకొంది. భూమయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. బాధితుడిని జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. బాధితుడి కోడలు మూల సుజాత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు రూరల్ ఏఎస్సై శంకరయ్య తెలిపారు.

తుంగూర్‌లో పశుగ్రాసం దగ్ధం



సారంగాపూర్ (జగిత్యాల): బీర్‌పూర్ మండలం తుంగూర్ గ్రామంలో ఆదివారం ప్రమాదవశాత్తు పశుగ్రాసం దగ్ధమైయింది. కొండ గంగాధర్ రైతు ఇటీవల వరి కోతలు పూర్తిచేసి, పశువుల కోసం ఇంటి సమీపంలో పశుగ్రాసాన్ని నిల్వ చేసుకున్నాడు. ప్రమాదవశాత్తు నిప్పంటుకోవడంతో పశుగ్రాసం కాలిపోయింది. గ్రామస్తులు మంటలను అదుపులోకి తెచ్చారు. అయినా, అప్పటికే గడ్డి కాలిపోయింది.

మూడు తరాలు.. ఒకే చోట



హైదరాబాద్‌లో కముటాల కుటుంబ సభ్యులు

సిరిసిల్ల : సిరిసిల్లకు చెందిన కముటాల ‘బలగం’ ఆదివారం కలిసింది. కోనరావుపేట మండలం మర్రిమడ్లకు చెందిన కముటాల విఠల్, నాగలక్ష్మీ దంపతుల కుమారులు ప్రసాద్, విశ్వేశం, శ్రీనివాస్, వారి మరో ముగ్గురు సోదరీమణుల పిల్లలు వివిధ ప్రాంతాల్లో స్థిరపడ్డారు. హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు రిసార్ట్‌లో ఆదివారం కలుసుకొని వేడుకలు చేసుకున్నారు. ఆరు కుటుంబాలకు చెందిన 96 మంది బంధువులు ఉండగా 82 మంది కలుసుకొని ఆత్మీయతను పంచుకున్నారు. మూడు తరాల పెద్దలు, పిల్లలు అందరూ ఎన్నో ఏళ్ల తర్వాత ఇలా కలుసుకొని ఆప్యాయంగా పలకరించుకున్నారు.

రైతు ఆత్మహత్య

బోయినపల్లి (చొప్పదండి) : బోయినపల్లికి చెందిన కొండవేని రాజు (29) అనే యువ రైతు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. హెడ్ కానిస్టేబుల్ సత్తయ్య తెలిపిన వివరాల ప్రకారం.. బోయినపల్లికి చెందిన కొండవేని పర్శరాములుకు ఇద్దరు కుమారులు, కూతురు ఉంది. రెండో కుమారుడు రాజు తన భూమితో పాటు, సోదరుడి భూమి కలిపి మరో వ్యక్తికి చెందిన మూడెకరాలు కౌలుకు తీసుకున్నాడు. మొత్తం ఆరెకరాల్లో పంట వేయగా పెట్టుబడి కోసం అప్పులు చేశాడు. ఆశించిన మేర దిగుబడి రాకపోవడంతో అప్పులు ఎలా తీర్చాలని మనోవేదన చెందాడు. ఆదివారం పొలం వద్ద చెట్టుకు ఉరేసుకున్నాడు. తండ్రి పర్శరాములు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ తెలిపాడు. రాజుకు భార్య మౌనిక, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు.

అనుమానిత వ్యక్తి సంచారం

బోయినపల్లి(చొప్పదండి) : మండలంలోని వరదవెల్లి ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో శనివారం రాత్రి ఓ అనుమానిత వ్యక్తి సంచరించాడు. గ్రామస్తుల తెలిపిన వివరాల ప్రకారం.. రాత్రి సమయంలో ఓ వ్యక్తి ద్విచక్రవాహనంపై వచ్చి గ్రామంలోని ఓ భవనం ఎక్కాడు. కొందరు చూసేసరికి మరో భవన పరిసరాల్లోకి వెళ్లాడు. అక్కడ కనిపించకపోవడంతో గ్రామస్తులు డయల్ 100కు ఫోన్ చేశారు. పెట్రోలింగ్ సిబ్బంది అక్కడికి వచ్చి వెతకగా ఆచూకీ లభించలేదు. పోలీసులు ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో పశువుల కాపరి మృతి

సిరిసిల్లటౌన్: పశువులను తోలుకుపోవడానికి వెళ్తున్న కాపరిని కారు ఢీకొట్టడడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. స్థానికులు తెలిపిన వివరాలు. వేములవాడ మండలం తెట్టెకుంటకు చెందిన పశువుల కాపరి కరీం సిరిసిల్ల పట్టణంలోని శాంతినగర్‌లోని ఓ పాడి రైతువద్ద పనిచేస్తున్నాడు. రోజులాగే పశువులను మేపడానికి సిరిసిల్ల శివారులోని రైస్‌మిల్లు వెనకాలకు తీసుకొచ్చాడు. ఆదివారం సాయంత్రం పశువులను యజమాని ఇంటికి తీసుకెళ్లడానికి సైకిల్‌పై సిరిసిల్లకు వస్తుండగా వెనకాల నుంచి కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అక్కడికక్కడే మృతిచెందాడు. కారు, డ్రైవర్ ఆచూకీ లభించలేదు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. నిందితుల కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు.